క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: సుదర్శిని ఐ అండ్ విజన్ అసోసియేషన్, సుదర్శిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో యాదవ హైస్కూల్ పూర్వ అధ్యాపకుల అసోసియేషన్ సహకారంతో ఆదివారం పాత గుంటూరు యాదవ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సుదర్శిని కంటి హాస్పిటల్ మేనేజర్ వెంకట్రావు తెలిపారు. అత్యాధునిక పరికరాలు ఉన్న 'విజన్ ఆన్ వీల్స్' సంచార కంటి ఆసుపత్రిని వైద్య శిబిరానికి తీసుకొచ్చి పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు శిబిరాన్ని వినియోగించుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు.

భారతదేశ అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి



గుంటూరు మెడికల్: బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలో ప్రజాపోరు ప్రారంభమైంది. తొలుత స్థానిక కొత్తపేట శివాలయంలో ఆయన పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని ప్రజలు మూడోసారి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఏపీలో అభివృద్ధికోసం బీజేపీకి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, చరకా కుమార్ గౌడ్, పోతురాజు వెంకటేశ్వర్లు, కామేపల్లి వెంకటేశ్వర్లు, సురేష్ జైన్, బాబూరావు, మనోజ్, అనిల్, సత్యనారాయణ, వీరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాజాత



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు హ్యాపెన్ సంస్థ శుక్రవారం స్థానిక మిర్చి యార్డులో కళాజాత బృందాలతో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ బాధితులతో వ్యవహరించే తీరు, హెచ్ఐవీ, టీబీ మధ్య ఉన్న సంబంధం గురించి కళాజాత ద్వారా వివరించారు. కార్యక్రమంలో హ్యాపెన్ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, మేనేజర్ జి.జయరాజు, ఏఎస్ఎం అమ్మాజీ, సురేష్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి



పట్నంబజారు: ద్విచక్ర వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ సీఐ బి.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. హుస్సేన్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ హుస్సేన్ (25) శుక్రవారం మధ్యాహ్నం స్నేహితులు తోట జయ ఆదిత్య, ఎస్. తరుణ్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై బ్రహ్మానందరెడ్డి స్టేడియం నుంచి హుస్సేన్ నగర్‌వైపు వెళ్లారు. ఎం. కన్వెన్షన్ వద్ద డివైడర్ పక్కన నిలుచుకుని టర్నింగ్ తిప్పుకునే క్రమంలో వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో మహబు హుస్సేన్‌కు తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. జయ ఆదిత్య, తరుణ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన మరో ద్విచక్ర వాహనదారుడి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రాంగణ ఎంపికల్లో చిప్స్ విద్యార్థుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించటం తమ కళాశాల లక్ష్యమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని చిప్స్ కళాశాలలో చెన్నైకి చెందిన ఒమెగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరుకాగా మొత్తం 145 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారన్నారు. వారిలో తమ కళాశాలకు చెందిన 80 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఏడాదికి రూ 2.5 లక్షల వేతనం ఇస్తూ సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ సీఎస్ శ్రీనివాస్ అభినందించారు.

సరదా సరదా సిగిరెట్టు.. ఆరోగ్యానికి పొగ పెట్టు

గుంటూరుకు చెందిన 35 సంవత్సరాల అబ్దుల్లా రోజువారి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 12 సంవత్సరాలుగా స్మోకింగ్ అలవాటుతో ఇబ్బంది పడుతూ, మానాలనుకొని ప్రయత్నించి కూడా విఫలమయ్యాడు. గుంటూరు జీజీహెచ్‌లో స్మోకింగ్ అలవాటు మాన్పించేందుకు ప్రత్యేక చికిత్స కేంద్రం ఉందని తెలుసుకుని మూడు నెలలుగా అక్కడ చికిత్స పొంది నేడు మానేశాడు. ఇలా ఎంతో మంది యువకులు యవ్వనంలో పొగ తాగేందుకు అలవాటు పడి, దాని ద్వారా ఆరోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. సరైన చికిత్స తీసుకోవడం ద్వారా పొగ తాగుడు విడనాడవచ్చు. గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా మాన్పించేందుకు ప్రత్యేక మందులు, కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

- పొగ తాగే అలవాటు మానాలనుకుంటున్నారా ?
- ఉచితంగా జీజీహెచ్‌లో వైద్య సేవలు



పొగాకు మానాలనుకునే వారికి వాడే మందులు



జీజీహెచ్‌లో పొగతాగే అలవాటు మాన్పించే కేంద్రం

గుంటూరు మెడికల్: యవ్వనంలో సరదా కోసం, ఫ్యాషన్ కోసం పొగ తాగడానికి, వినియోగానికి అలవాటు పడిన పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. సదరు వ్యక్తి వ్యాధికి గురవడంతో పాటు పొగాకు వినియోగం ఇంట్లో చేయడం ద్వారా కుటుంబ సభ్యులు సైతం అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా ఇంట్లో పెద్దవారు పొగతాగడం వల్ల అభం శుభం తెలియని చిన్న పిల్లలు వ్యాధుల బారిన పడుతున్నారు. పలువురు ఈ అలవాటును మానాలని అనుకుంటున్నామని, కాని మానలేకపోతున్నామని స్నేహితులు, బంధువుల వద్ద వాపోతూ ఉంటారు. అయితే, నిజంగా పొగతాగే అలవాటును మానాలనుకునేవారికి చక్కని అవకాశం నేడు అందుబాటులో ఉంది. గుంటూరు జీజీహెచ్‌లో స్మోకింగ్, పొగాకు వినియోగపు అలవాటును విడనాడాలనుకునేవారికి పూర్తి ఉచితంగా కౌన్సెలింగ్ చేసి మందులు అందిస్తున్నారు. ఎంతో మంది అలవాటును విడనాడి పూర్తి ఆరోగ్యంగా, ఆనందంగా గడుపుతున్నారు.

2019 నుంచి ఉచిత వైద్య సేవలు

గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగం డీ అడిక్షన్ సెంటర్‌లో 2019లో పొగాకు వినియోగపు అలవాటును మాన్పించే కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. క్విట్ టు టుబాకో కార్యక్రమంలో భాగంగా ఉచితంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అనంతరం నికోటిన్ ట్రాన్స్‌థర్మల్ ప్యాచెస్‌ను పొగ అలవాటు విడనాడాలనుకునేవారికి భుజంపై అంటించి వ్యసనాన్ని వీడేలా చేస్తున్నారు. ప్రతి సోమవారం నుంచి శనివారం వరకు అవుట్ పేషెంట్ విభాగం 21వ నంబరు మానసిక వ్యాధుల విభాగంలో ప్రత్యేకంగా పొగ మాన్పించే కేంద్రం ఏర్పాటు చేశారు. సైకాలజిస్టులు, కౌన్సిలర్లు, సైక్రియాటిస్టులు, మెడికల్ ఆఫీసర్లు, కేంద్రంలో అందుబాటులో ఉండి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కార్బన్ మోనాక్సైడ్ మోనిటర్ ద్వారా ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు నిర్వహించి తదనుగుణంగా ఉచితంగా మందులను అందిస్తున్నారు.

సిగరెట్లు తాగేదాన్ని బట్టి మందుల కోర్సు

ప్రతిరోజూ 30 సిగరెట్లు పైబడి తాగేవారికి తొలుత 21 ఎంజీ ప్యాచెస్‌ను నాలుగు వారాల పాటు కోర్సు అందిస్తారు. ఛాతికి ముందు భాగంలో, భుజానికి, తొడకు ఏదైనా ఒక ప్రదేశంలో వెంట్రుకలు లేని ప్రాంతంలో నికోటిన్ ట్రాన్స్ థర్మల్ ప్యాచ్‌ను అంటిస్తారు. తదుపరి కౌన్సెలింగ్ చేసి ఫాలో అప్ ట్రీట్‌మెంట్‌లో భాగంగా 14 ఎంజీ ప్యాచెస్ రెండు వారాలు, 7 ఎంజీ ప్యాచెస్ రెండు వారాలు ఇచ్చి వ్యసనం నుంచి విముక్తి చేస్తున్నారు. 2023లో జీజీహెచ్ కేంద్రంలో 1069 మందికి ప్యాచెస్ అంటించి కౌన్సెలింగ్ చేసి చికిత్స చేయగా, నెలకు పది మంది చొప్పున పొగాకు వినియోగాన్ని పూర్తిగా మానేసినట్లు జీజీహెచ్ వైద్య సిబ్బందికి తెలియజేశారు.

మాన్పించడం సులువే



గుంటూరు జీజీహెచ్‌లో మద్యం, గంజాయి, పొగాకు నమలడం, ధూమపానం చేయడం లాంటి వ్యసనాల నుంచి విముక్తి చేసేందుకు ప్రత్యేకంగా వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వం ఎంతో ఖరీదైన మందుల్ని సైతం బాధితులకు ఉచితంగా అందజేస్తుంది. ప్రతిరోజూ ఎంతో మంది బాధితులు జీజీహెచ్‌కు వచ్చి కౌన్సెలింగ్ తీసుకుని మందులు వాడడం ద్వారా వ్యసనాలను విడనాడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కువ మందిని వ్యసనాల నుంచి విముక్తులను చేస్తున్నందుకు జీజీహెచ్ వ్యసన విముక్తి కేంద్రానికి ఉన్నతాధికారులు ప్రశంసలు సైతం లభించడం సంతోషంగా ఉంది. కుటుంబంలో ఎవరైనా వ్యవసనాలతో ఇబ్బంది పడుతుంటే కుటుంబ సభ్యులు వారిని గుర్తించి జీజీహెచ్‌కు తీసుకొస్తే సులువుగా మాన్పించవచ్చు.

– డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, నోడల్ ఆఫీసర్, గుంటూరు జీజీహెచ్

పేదల పక్షాన యుద్ధానికి సీఎం జగన్ సిద్ధం

- విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి
- కార్యకర్తలు, నేతల ఆత్మీయ సమావేశంలో దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి. వేదికపై ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి, సమన్వయకర్త నూరిఫాతిమా, నాయకులు

పట్నంబజారు: అరాచకాలు.. అవాస్తవాలు.. అక్రమ పొత్తులతో అందలమెక్కడమే ధ్యేయంగా పెత్తందారులంతా ఓ వైపు మూకుమ్మడిగా రానున్న ఎన్నికల బరిలో దిగుతుంటే.. మరోవైపు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా.. మేలు జరిగిందని భావిస్తేనే ఓటు వేయండని పిలుపునిస్తూ.. పేదల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే యుద్ధానికి సిద్ధమైనట్లు శాసనమండలి విప్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఒకటవ డివిజన్‌లో కార్యకర్తలు, నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశానికి పార్టీ నేత కర్నుమా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విప్ అప్పిరెడ్డి మాట్లాడుతూ పేదలు, పెత్తందారుల నడుమ సాగనున్న సమరంలో వైఎస్సార్ సీపీకి సామాన్య కార్యకర్తలే స్టార్ క్యాంపెయినర్స్ అని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కంచుకోటని చెప్పారు. ఇక్కడ రెండుసార్లు గెలిచిన ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు తన సొంత నిధులు కూడా వెచ్చించి ఈ ప్రాంత ప్రగతికి కంకణబద్ధులై ముందుకు సాగినట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే అభ్యర్థిగా మన ముందుకు ముస్తఫా కుమార్తె షేక్ నూరి ఫాతిమా వచ్చినట్లు చెప్పారు. సీఎం జగన్ ఎలా అయితే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్. రాజశేఖరరెడ్డి కంటే నాలుగడుగులు ముందుకేసి పేదల జీవితాల్లో సమూలమైన మార్పుకు శ్రీకారం చుట్టారో... సరిగ్గా అలానే ముస్తఫా కన్నా మిన్నగా నియోజకవర్గాన్ని నందనవనంలా తీర్చిదిద్దాలన్న గట్టి సంకల్పంతో ఆమె ఉందని తెలిపారు. 2014 నుంచి ప్రతి కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించిన నూరి ఫాతిమాను భారీ మెజారిటీతో గెలిపించుకోవడం మనందరి ముందున్న తక్షణ కర్తవ్యమని చెప్పారు. క్షేత్రస్థాయిలో సుశిక్షితులైన సైనికుల్లా ఎన్నికల యుద్ధం చేయాలని.. నూరి ఫాతిమా గెలుపులో ప్రతి ఒక్కరూ ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

- తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తున్న పథకాలకు ప్రత్యర్థి పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులే ఆకర్షితులవుతున్న వాతావరణం సర్వత్రా నెలకొని ఉందన్నారు. తాను నియోజకవర్గంలో తిరుగుతున్నప్పుడు విపక్షాలకు చెందిన వారే తనతో ఈ విషయాన్ని స్వయంగా చెబుతున్నారని, ఈ పథకాలు కొనసాగాల్సిన అవసరం ఉందని.. అందుకోసం తాము వేరే పార్టీకి చెందిన వారైనప్పటికీ ఓటు మాత్రం మీ పార్టీకే వేస్తామని పలువురు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు అత్యంత ప్రయోజనకరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగేందుకు వీలుగా ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని కోరారు.
- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన నాటి నుంచి రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు సాగుతోందన్నారు. అందుకు గుంటూరులో జరిగిన అభివృద్ధే ప్రత్యక్ష నిదర్శనమని, అందులో భాగంగానే ఎమ్మెల్యే ముస్తఫా నేతృత్వంలో తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పరంగా ఎంతో మార్పు తెచ్చినట్లు తెలిపారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ప్రజలు ఆధారపడి బతకాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదని తెలిపారు. ఎన్ని పార్టీలు, ఎన్ని కూటములు కలిసి వచ్చినా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కాకుండా అడ్డుకోవటం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు.
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ జెండాలు జత కట్టడమే ప్రతిపక్ష నేతల అజెండా అయితే పేదప్రజల గుండెల్లో సంక్షేమ గుడి కట్టడమే జగన్ అజెండా అని చెప్పారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధమని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో తనను ప్రతి ఒక్కరూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నేతలు గులాం రసూల్, నాహెద్, వాకా శ్రీనివాసరెడ్డి, తోట ఆంజనేయులు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ సుభాని, అగ్గిపెట్టి రాజు, నూనె ఉమామహేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, పూనూరి నాగేశ్వరరావు, పల్లపు మహేష్, శృంగవరపు శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, వెంకాయమ్మ, కాసు శ్రీకాంత్ రెడ్డి, చిన్న ఈశ్వరరెడ్డి, టి.జనార్దన్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, పలువురు పార్టీ ముఖ్య నాయకులు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జీవ మనుగడకు విస్తృతమైన అధ్యయనం అవసరం

వీసీ ఆచార్య పి. రాజశేఖర్



ప్రసంగిస్తున్న వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ: జీవ మనుగడకు దోహదం చేసే అంశాలపై విస్తృతమైన అధ్యయనం జరగాల్సిన ఆవశ్యకత ఉందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'నావల్ ప్రాసెసస్ అండ్ అప్లికేషన్స్ ఇన్ బయాలజీ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలోని పరిస్థితులను బట్టి లైఫ్‌సైన్స్ విద్యార్థులు, పరిశోధకులు వారి ఆలోచనల్లోని సృజనాత్మకతను పూర్తిగా ఉపయోగించేలా మానసికంగా సన్నద్ధమవ్వాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న కఠిన పరిస్థితులను నివారించేందుకు జీవశాస్త్ర విధానాలు దోహదం చేస్తాయని తెలిపారు. సైన్స్ విద్యార్థులు మానవతా విలువలు, మతసామరస్యం కలిగి హేతుబద్ధమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక ప్రపంచాన్ని ఏకీకృతం చేస్తున్న సమయంలో విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం అలవర్చుకోవాలని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని మనసా వాచా ఆచరించాలని చెప్పారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ కోవిడ్ -19 తరువాత ప్రపంచ శాస్త్ర సాంకేతిక సమాజం ఎన్నో సవాళ్లను ఎదుర్కొందని, అయినప్పటికీ జీవశాస్త్రంలోని అధునాతన విధానాలతో వాటిని అధిగమించినట్లు తెలిపారు. ప్రధాన వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య రాజగోపాల్, ఆచార్య వై. శ్రీనివాసులు, డాక్టర్ ఎస్. సిద్ధార్థ్ అధునాతన అంశాలైన ఫోటో సింథసిస్, ఎపోమిక్స్, మాలిక్యులర్, ఫైల్లో జెనిటిక్స్ వంటి అంశాలపై పరిశోధన సారాంశాన్ని తెలియజేశారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్యాపకులు డాక్టర్ టి. చంద్రశేఖర్ జీవ వ్యర్థాల నుంచి ఇంధనం తయారీ, వాటి నిర్వహణ పద్ధతులను వివరించారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా , తమిళనాడు, రాష్ట్రాల నుంచి 450 మంది విద్యార్థులు, పరిశోధకులు నుంచి శాస్త్రవేత్తలు హాజరయ్యారని డైరెక్టర్ ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. కార్యక్రమంలో విభాగం ఆధ్యాపకులు ఆచార్య ఎస్ఎం. ఖాసిం, అమృతవల్లి, మాధవి, పి. రాజు, తిరుపతిరావు పాల్గొన్నారు.

నేటి నుంచి హరికథా గానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి, 79వ వర్ధంతి పురస్కరించుకొని శనివారం నుంచి మార్చి 3వ తేదీ వరకు హరికథ గానం నిర్వహించనున్నట్లు శ్రీ నారాయణ దాస కథాగాన కళాపరిషత్ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతికి చెందిన హరి కథ రాజహంస జయంతి సావిత్రి భాగవతారిణి నిర్వహణలో జరిగే హరికథా గానంలో సంగీతాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

రైతుల బాధను అర్థం చేసుకోవడంలో కేంద్రం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యావేత్త సింగరయ్య

లక్ష్మీపురం: రైతుల బాధల్ని అర్థం చేసుకోవడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విశ్లేషణ సభలో ఆయన మాట్లాడారు. పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని ఖానోరీ వద్ద ప్రస్తుత యుద్ధ వాతావరణం చూస్తే ప్రభుత్వ మొండి వైఖరి, నియంతృత్వ విధానాలు అర్థం మవుతున్నాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్రాంత అధికారి పి.భావన్నారాయణ మాట్లాడుతూ కేంద్రం ఇప్పటికైనా రైతుల ఆవేదనని అర్థం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు మురళి, సదాశివం ప్రసంగించారు.

భక్తుల కోరికలు తీర్చే వేంకటేశ్వరస్వామి



స్వామి పల్లకి సేవలో పాల్గొన్న మంత్రి విడదల రజిని

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంత్రి గురువారం రాత్రి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు, స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

శిశువుల అపహరణ అరికట్టేందుకు పటిష్ట ప్రణాళిక



శిశుతోపాటు, తల్లికి ట్యాగ్ వేసిన దృశ్యాన్ని చూపుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో శిశువుల అపహరణను అరికట్టేందుకు బృహత్తర ప్రణాళికను రూపొందించిందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. కాన్పుల వార్డు వద్ద శుక్రవారం రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ శిశువు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాన్పుల వార్డు, ప్రసూతి వార్డులలో శిశువుల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో నిఘా కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పుట్టిన శిశువులకు, తల్లులకు ట్యాగ్ వేస్తున్నట్లు చెప్పారు. ఇద్దరూ వేరు కాకుండా మానిటరీ చేస్తూ, నిఘా ద్వారా శిశువుల అపహరించే వారిని వెంటనే గుర్తించే విధంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్యాగ్ లను ఎవరైనా తొలగించాలని ప్రయత్నిస్తే వెంటనే అలారం మోగి సంబంధిత సిబ్బందిని అలెర్ట్ చేస్తుందని వివరించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం 40 రీడర్లు, అలారంలను అమర్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, గైనకాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ వి.అరుణ, పి. జయంతి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆషా సజని, కాలర్ మేనేజర్ కిరణ్, ఎన్. జగదీశ్ పాల్గొన్నారు.

సమాజ సేవ నిత్య జీవితంలో భాగం కావాలి



వెంగళాయపాలెంలో విద్యార్థినులు, అధ్యాపకులతో ఉప సర్పంచ్ మాధవి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజ సేవ నిత్య జీవితంలో భాగం కావాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-2 విభాగ ఆధ్వర్యంలో జోసెఫ్ నగర్‌లో ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ ఈనెల 29వ తేదీ వరకు జోసఫ్‌నగర్‌లో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశలో సామాజిక సేవ పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ ధాత్రికుమారి మాట్లాడుతూ విద్యార్థులంతా అంకితభావంతో సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శైలజారాణి, వి. భవాని, యన్. విజయలక్ష్మి, కె. విజయకుమారి కె. సుబ్బరత్తమ్మ, వి.కోటేశ్వరరావు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వెంగళాయపాలెంలో...

బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో వెంగళాయపాలెం గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కౌసల్యాదేవి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామంలో ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్త్రీ విద్య అనే అంశంపై ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మాధవి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు బి. విజయభాస్కర్, కార్యదర్శి చేగు శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాధవపెద్ది గిరిజ, ఎస్ఎల్ దీప్తి, అధ్యాపకులు సంధ్య, పద్మావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం తిరుపతమ్మ తల్లి

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత శ్రీ తిరుపతమ్మ తల్లి అని పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం చల్లావారిపాలెం గ్రామం సీతమ్మ కాలనీలోగల శ్రీ తిరుపతమ్మ తల్లి ఆలయ 7వ వార్షిక కల్యాణ, వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. సమన్వయకర్త ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానం కార్యక్రమాన్ని సమన్వయకర్త ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతోనే దేశాభివృద్ధి

ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ రవి గుజ్జుల



మాట్లాడుతున్న డాక్టర్ రవి గుజ్జుల

గుంటూరు రూరల్: పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధిలో పురోగతి సాధించుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలు సులభతరమవుతాయని ఏపీఎస్ఎస్‌డీసీ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ గుజ్జుల రవి తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ 2047 విజన్ సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన అగ్రదేశాలకు దీటుగా భారత దేశాన్ని నిలిపే లక్ష్యంతో రూపొందించిన కార్యక్రమం వికసిత్ భారత్ 2047 విజన్ అని తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు అందిస్తున్న తోడ్పాటును వినియోగించుకోవాలని చెప్పారు. ది ఫ్యూచర్ ఈస్ నౌ షేపింగ్ ఏ డెవలప్డ్ ఇండియా త్రు ఐ టీ ఎనేబుల్డ్ స్కిల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించి విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల అధ్యక్షుడు ఆర్. శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవలకు కేంద్ర ప్రభుత్వం నుంచి పురస్కారాన్ని తమ కళాశాల అందుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అతిథిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎమ్‌వీపీ చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు ఘనంగా సన్మానించారు.